TGTEL/26/A7716

# ఉద్యమ పోరు

ప్రతి పదం పోరాట కదం

UDYAMA PORU

| వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 13 | శనివారం | 26.09.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్ |
|---|---|---|---|---|---|---|---|
| Warangal | Volume - 1 | Issue - 13 | Saturday | 26.09.2026 | Pages - 8 | Price: 3 /- | Editor - Bandari Sumanth |

## సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్'

# ఉత్తమ ప్రజాసేవ అవార్డు

- కేరళలోని నీలంబూరులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా అవార్డు
- తెలంగాణలో సంక్షేమ పథకాలకు గుర్తింపుగా ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వెల్లడి
- మతతత్వ శక్తులను వ్యతిరేకం చడమే నిజమైన నివాళి అని పేర్కొన్న రేవంత్
- కేంద్ర ప్రభుత్వంపై ఓట్లు, పార్టీలు, నిధుల దొంగతనం అంటూ తీవ్ర విమర్శలు

**ఉద్యమపోరు, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ మొహమ్మద్ ఉత్తమ ప్రజాసేవ పురస్కారం-2026' అందుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ మొహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కేరళలోని నీలంబూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా రేవంత్ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణలో రైతులు, బడుగు బలహీన వర్గాలు, సామాన్య ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ, ప్రజాస్వామ్య విలువల పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆర్యదాన్ మొహమ్మద్ ఫౌండేషన్ ప్రకటించింది. ఈ అవార్డు కింద లక్ష రూపాయల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు. ఎంపీ బెన్నీ బెహనాన్, కేరళ మంత్రి ఏపీ అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్పేట నారాయణన్ సభ్యులుగా ఉన్న జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. » 2

## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం..

- నేడు ఆవిష్కరించనున్న సీఎం రేవంత్

- హైదరాబాద్ గచ్చిబౌలిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు
- ఆయన జయంతి సందర్భంగా శనివారం ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- మన్మోహన్ సింగ్ దేశానికి, తెలంగాణకు చేసిన సేవలను స్మరించుకున్న మంత్రి పొన్నం
- ఆయన నాయకత్వంలోనే ఉపాధి హామీ, ఆర్టీఐ వంటి చట్టాలు వచ్చాయని వెల్లడి

**ఉద్యమపోరు, హైదరాబాద్ :** మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ఐటీ కారిడార్ అయిన గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం (సెప్టెంబరు 26) ఆవిష్కరించనున్నారు. » 2

## దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి : ప్రధాని మోదీ

- దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి
- వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి
- అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య

» 2

## ఐరాస వేదికగా భారత్-రష్యా మైత్రి..

## పలు అంశాలపై చర్చలు

- న్యూయార్క్‌లో సమావేశమైన జైశంకర్, లావ్రోవ్
- ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పునరుద్ఘాటించిన ఇరు దేశాలు
- ఐరాస, జీ20, బ్రిక్స్ వేదికలపై సహకారంపై చర్చ
- ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించుకున్న మంత్రులు



» 2

## హైదరాబాద్‌కు రాపిడో ఫుడ్ డెలివరీ..

## స్విగ్గీ, జొమాటోకు పోటీగా 'ఓన్లీ'

- హైదరాబాద్‌లో 'ఓన్లీ' ఫుడ్ డెలివరీని ప్రారంభించిన రాపిడో
- జీరో కమిషన్ మోడల్‌తో రెస్టారెంట్లకు పూర్తి ప్రయోజనం
- కస్టమర్లకు ప్లాట్‌ఫామ్, సర్జ్ ఛార్జీల నుంచి మినహాయింపు

ownly

వివరాలు 2 లో

## పాకిస్థాన్ జర్నలిస్టుకు జైశంకర్ దిమ్మతిరిగే కౌంటర్

- ఐరాసలో పాకిస్థానీ జర్నలిస్టుకు గట్టిగా బదులిచ్చిన జైశంకర్
- ఉగ్రవాద దేశం నన్ను ప్రశ్నిస్తోందా అని ఎదురుదాడి
- పాక్‌లో భారత్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందన్న ఆరోపణపై స్పందన
- పాక్ తన సమస్యలపై దృష్టి పెట్టాలని మరో భారత దౌత్యవేత్త హితవు

» 2

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి

### ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

» 2

## బడా గణేశ్ శోభాయాత్ర

**- పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్**

- ఖైరతాబాద్ గణేశ్ శోభాయాత్రలో డ్యాన్స్ చేసిన దానం నాగేందర్
- మహిళా కానిస్టేబుళ్లతో కలిసి స్టెప్పులేసిన వైనం
- 'ప్యారడైజ్' సినిమా పాటకు డ్యాన్స్ చేసి ఉత్సాహం పంచారు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో
- బడా గణేశ్ నిమజ్జన వేడుకల్లో చోటుచేసుకున్న ఘటన

» 2

## దేశంలో తగ్గుతున్న గ్యాస్ వాడకందార్ల సంఖ్య..!

- దేశంలో తొలిసారిగా తగ్గిన ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు
- ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య 62 లక్షల కనెక్షన్ల తగ్గుదల
- అమెరికా-ఇరాన్ యుద్ధంతో దిగుమతులపై తీవ్ర ప్రభావం
- కొత్త కనెక్షన్ల నిలిపివేత, ఆధార్‌తో నకిలీల ఏరివేత

**ఉద్యమపోరు, డెస్క్ :** దేశంలో గడిచిన దశాబ్ద కాలంలో తొలిసారిగా గృహ వినియోగ ఎల్పీజీ వినియోగదారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మొదటి వారం మధ్య సుమారు 62 లక్షల యాక్టివ్ గ్యాస్ కనెక్షన్లు తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 333.9 మిలియన్లుగా ఉన్న వినియోగదారుల సంఖ్య, సెప్టెంబర్ నాటికి 327.7 మిలియన్లకు పడిపోయింది. పేద కుటుంబాల కోసం ఉద్దేశించిన ఉజ్వల పథకం లబ్ధిదారులు కూడా 6 లక్షల మేర తగ్గడం గమనార్హం. ఈ తగ్గుదలకు ప్రధాన కారణం అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణమేనని తెలుస్తోంది....

2

## రూ.39 లక్షలకు బాలాపూర్ లడ్డూ..

- ముగిసిన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం
- దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి
- ఈసారి వేలంలో 9 మంది
- పోటీపోటీగా పెరిగిన బిడ్లు
- లడ్డూను దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకం

» 2

# దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి : ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి..** స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వివరించారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తు చేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం కావాలని ఆయన భావించినట్లు తెలిపారు. పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ వివరించారు. ఈ ఆలోచనల స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా 'వికసిత్ భారత్' నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

**మొదటిపేజీ తరువాయి..** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు అసలైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువత భవిష్యత్తును దొంగిలిస్తోందని విమర్శించిన ఆయన, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలని ప్రజలను కోరారు. రాహుల్ గాంధీ తదుపరి భారత ప్రధాని అవుతారని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే రాజకీయ పోరాటం "గాంధీ పరివార్", "సంఘ్ పరివార్" మధ్యే జరుగుతోందని ఆయన అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ దేశం సంఘ్ పరివార్ వైపు ఉంటుందా లేక గాంధీ పరివార్ వైపు ఉంటుందా అనేది తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి - ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

## రూ.39 లక్షలకు బాలాపూర్ లడ్డూ..

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్ వినాయక ఉత్సవాల్లో ఎంతో ప్రత్యేకమైన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట ముగిసింది. ఈసారి లడ్డూకు భారీ ధర పలికింది. సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. దీంతో బాలాపూర్ లడ్డూ వేలంలో కొత్త రికార్డు నమోదైంది. ప్రతి ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంపై భక్తుల్లో భారీ ఆసక్తి ఉంటుంది. ఈసారి కూడా లడ్డూను దక్కించుకునేందుకు 9 మంది భక్తులు వేలంలో పాల్గొన్నారు. ఒకరిని మించి మరొకరు బిడ్ పెంచడంతో వేలం ఉత్కంఠగా సాగింది. చివరికి రూ.39 లక్షల వద్ద సామ ప్రణీత్ రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. లడ్డూను దక్కించుకున్న ప్రణీత్ రెడ్డిని ఉత్సవ నిర్వాహకులు, తోటి భక్తులు అభినందించారు. బాలాపూర్ గణేశుడి లడ్డూను దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. దీంతో ప్రతి ఏడాది ఈ లడ్డూకు వేలంలో భారీ పోటీ నెలకొంటోంది.

# హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం..

## - నేడు ఆవిష్కరించనున్న సీఎం రేవంత్

**మొదటిపేజీ తరువాయి..** ఈ కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ విగ్రహం కేవలం ఒక స్మారక చిహ్నం కాదని, దేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్ర, ఆయన ఆర్థిక దార్శనికత, నిస్వార్థ ప్రజాసేవ, నిరాడంబర నాయకత్వ లక్షణాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసే ఒక శాశ్వత ప్రతీక అని ఆయన అభివర్ణించారు. మన్మోహన్ సింగ్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పొన్నం కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన ప్రారంభించిన సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు బాటలు వేశాయని గుర్తు చేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన హయాంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి అమల్లోకి వచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 2009లో ప్రక్రియ ప్రారంభించాలని నాటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఏర్పాటులో యూపీఏ ప్రభుత్వం, మన్మోహన్ సింగ్ పాత్రను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ఆయన తెలిపారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో ఎంపీగా పని చేయడం తన రాజకీయ జీవితంలో గర్వకారణమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# దేశంలో తగ్గుతున్న గ్యాస్ వాడకందార్ల సంఖ్య..!

**మొదటిపేజీ తరువాయి..**
ఈ తగ్గుదలకు ప్రధాన కారణం అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణమేనని తెలుస్తోంది. ఈ ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాల నుంచి ఎల్పీజీ దిగుమతులకు ఆటంకం కలిగిం ది. భారత్ తన గ్యాస్ అవసరాల్లో దాదాపు 90 శాతం గల్ఫ్ నుంచే దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, సరఫరా వ్యవస్థలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో చమురు మార్కెటింగ్ కంపెనీలు కొత్త గృహ వినియోగ ఎల్పీజీ కనెక్షన్ల జారీని నిలిపివేశాయి. అంతే కాకుండా, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ వెరిఫికేషన్ ద్వారా అధికారులు తనిఖీలను కఠినతరం చేశా రు. దీని ద్వారా వాడకం లో లేని కనెక్షన్లు, ఒకే కుటుంబంలో ఉన్న బహుళ కనెక్షన్లు, ఇప్పటికే పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వాడుతున్న ఇళ్లను గుర్తించి ఎల్పీజీ కనెక్షన్లను తొలగిస్తున్నారు. పీఎన్‌జీ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ఆ కనెక్షన్లకు మారేలా ప్రభుత్వం ప్రోత్సహించడం కూడా ఈ తగ్గుదలకు మరో కారణం. ప్రాంతాల వారీగా పరిశీలిస్తే, అత్యధికంగా దక్షిణ భారతదేశంలో 26.3 లక్షల కనెక్షన్లు తగ్గాయి. ఆ తర్వాత పశ్చిమ, ఉత్తర భారత దేశాల్లోనూ ఈ ప్రభావం అధికంగా కనిపించింది. దశాబ్దాలుగా క్రమంగా పెరుగుతూ వచ్చిన ఎల్పీజీ వినియోగదారుల సంఖ్య ఇలా ఒక్కసారిగా తగ్గడం ఇదే మొదటిసారి.

## బడా గణేశ్ శోభాయాత్ర : పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా దానం నాగేందర్ ఉత్సాహంగా నృత్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుక్రవారం వైభవంగా సాగుతున్న శోభాయాత్రలో ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బందోబస్తు విధుల్లో ఉన్న కొందరు మహిళా కానిస్టేబుళ్లతో కలిసి దానం నాగేందర్ నృత్యం చేశారు. ఇటీవల విడుదలైన 'ప్యారడైజ్' చిత్రంలోని ఒక పాటకు ఆయన ఉత్సాహంగా స్టెప్పులు వేసి వేడుకల్లో జోష్ నింపారు. పండుగ వాతావరణంలో ఆయన చేసిన ఈ నృత్యం అక్కడ ఉన్న భక్తులను, చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దానం నాగేందర్ నృత్యంపై నెటిజన్లు విభిన్న రీతుల్లో స్పందిస్తున్నారు. కొందరు ఆయనలోని ఉత్సాహాన్ని ప్రశంసిస్తుండగా, మరి కొందరు ఈ అంశంపై రాజకీయ కోణంలో వ్యాఖ్యలు చేస్తున్నారు.

## ఐరాస వేదికగా భారత్-రష్యా మైత్రి.. పలు అంశాలపై చర్చలు

**మొదటిపేజీ తరువాయి..** భారత్, రష్యాలు తమ మధ్య ఉన్న "ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని" మరోసారి పునరుద్ఘాటించాయి. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాలతో పాటు పలు కీలక అంతర్జాతీయ అంశాలపై వారు చర్చించారు. ఐక్యరాజ్యసమితి, జీ20, బ్రిక్స్ వంటి వేదికలపై పరస్పర సమన్వయాన్ని, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నట్లు రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సమావేశంపై జైశంకర్ స్పందిస్తూ.. "ప్రస్తుతం కొనసాగుతున్న పలు అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలను పంచుకున్నాం. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు బ్రిక్స్ వేదికగా సహకారాన్ని సమీక్షించాం" అని తెలిపారు. అయితే, ఈ భేటీలో ఉక్రెయిన్ యుద్ధం అంశం ప్రస్తావనకు వచ్చినట్లు ఇరు దేశాలు తమ అధికారిక ప్రకటనల్లో ఎక్కడా పేర్కొనలేదు. కాగా, ఇదే వారంలో జైశంకర్ ఉక్రెయిన్ విదేశాంగ మంత్రితో సమావేశమవడం గమనార్హం. ప్రపంచ ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ వంటి అంశాల్లో భారత్-రష్యా మధ్య దీర్ఘకాలంగా బలమైన సమన్వయం కొనసాగుతోంది. మానవతా దృక్పథంతో యుద్ధాన్ని ముగించాలని గతంలో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సూచించిన విషయం తెలిసిందే.

## హైదరాబాద్‌కు రాపిడో ఫుడ్ డెలివరీ.. స్విగ్గీ, జొమాటోకు పోటీగా 'ఓన్లీ'

**మొదటిపేజీ తరువాయి..** ప్రముఖ బైక్-ట్యాక్సీ సేవల సంస్థ రాపిడో, ఫుడ్ డెలివరీ రంగంలోకి తన వ్యాపార కార్యకలాపాలను విస్తరించింది. స్విగ్గీ, జొమాటో వంటి దిగ్గజ సంస్థలకు గట్టి పోటీనిచ్చే లక్ష్యంతో 'ఓన్లీ' (Ownly) పేరుతో హైదరాబాద్‌లో ఆహార పంపిణీ సేవలను ప్రారంభించింది. ఇప్పటివరకు బెంగళూరుకు పరిమితమైన ఈ సేవలు ఇప్పుడు నగరవాసులకు కూడా అందుబాటులోకి వచ్చాయి. వినియోగదారులు రాపిడో యాప్ ద్వారా లేదా ప్రత్యేకంగా రూపొందించిన 'ఓన్లీ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆహారాన్ని ఆర్డర్ చేయవచ్చు. 'ఓన్లీ' అనుసరిస్తున్న వ్యాపార నమూనా ప్రస్తుత మార్కెట్‌లో ఉన్న ఇతర ఫుడ్ డెలివరీ యాప్‌లతో పోలిస్తే భిన్నంగా ఉంది. స్విగ్గీ, జొమాటోల మాదిరిగా ప్రతి ఆర్డర్‌పై రెస్టారెంట్ల నుంచి కమిషన్ వసూలు చేయకుండా, 'ఓన్లీ' పూర్తిస్థాయిలో జీరో-కమిషన్ విధానాన్ని అమలు చేస్తోంది. దీనికి బదులుగా భాగస్వామ్య రెస్టారెంట్ల నుంచి కేవలం నెలవారీ సబ్‌స్క్రిప్షన్ రుసుమును మాత్రమే వసూలు చేస్తుంది. దీనివల్ల ఆర్డర్ ద్వారా లభించే పూర్తి ఆదాయాన్ని రెస్టారెంట్లే ఉంచుకోవచ్చు. మరోవైపు కస్టమర్లకు కూడా మెనూ ధర, డెలివరీ ఛార్జీలు మినహా ప్యాకేజింగ్ ఫీజులు, ప్లాట్‌ఫామ్ ఫీజులు, సర్జ్ ఛార్జీలు వంటి అదనపు ఆర్థిక భారం ఉండదని కంపెనీ స్పష్టం చేసింది. ఈ పంపిణీ సేవల కోసం రాపిడో తన ప్రస్తుత 'కెప్టెన్' (రైడర్) నెట్‌వర్క్‌నే వినియోగించుకోనుంది. బెంగళూరులో ఇప్పటికే ఈ సేవలు విశేష ఆదరణ పొందాయి. ఇప్పటివరకు 22,000 రెస్టారెంట్లతో భాగస్వామ్యం కుదుర్చుకుని, 42 లక్షల ఆర్డర్లను పూర్తి చేసినట్లు 'ఓన్లీ' తెలిపింది. ఈ సందర్భంగా రాపిడో సహ-వ్యవస్థాపకుడు అరవింద్ శంకా మాట్లాడుతూ, బెంగళూరులో లభించిన విజయం తమకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బలమైన ఫుడ్ కల్చర్ ఉన్నందున ఇక్కడ కూడా తమ సేవలు విజయవంతం అవుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రానున్న త్రైమాసికం (2026 అక్టోబర్) నుంచి దేశంలోని అన్ని ప్రధాన మెట్రో నగరాలకు 'ఓన్లీ' సేవలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

## పాకిస్థాన్ జర్నలిస్టుకు జైశంకర్ దిమ్మతిరిగే కౌంటర్

**మొదటిపేజీ తరువాయి..** ఐక్యరాజ్యసమితి సమావేశం వేదికగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పాకిస్థాన్‌కు చెందిన ఓ జర్నలిస్టుకు ఘాటుగా సమాధానమిచ్చారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పుడు ఆపుతుందంటూ సదరు విలేకరి అడిగిన ప్రశ్నకు జైశంకర్ తీవ్రంగా స్పందించారు. "ఒక ఉగ్రవాద దేశం నన్ను ఈ ప్రశ్న అడుగుతోందా?" అంటూ ఆయన సూటిగా ఎదురు ప్రశ్నించారు. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు జైశంకర్ పైవిధంగా బదులిచ్చి, ఇతర భారత ప్రతినిధులతో కలిసి అక్కడి నుంచి నిష్క్రమించారు. ఆ జర్నలిస్టు తన ప్రశ్నను పూర్తి చేసేలోపే భారత బృందం ఆ గదిని వీడింది. ఇటీవల కాలంలో ఉగ్రవాదం అంశంపై ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి వెనుక పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల హస్తం ఉందని భారత్ ఆరోపించింది. దీనికి ప్రతిచర్యగా, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ క్షిపణి దాడులు నిర్వహించింది. ఇదే సమయంలో, ఐరాస మానవ హక్కుల మండలిలో భారత దౌత్యవేత్త క్షితిజ్ త్యాగి సైతం పాకిస్థాన్ తీరును తీవ్రంగా విమర్శించారు. పరాయి దేశాల భూభాగాలను ఆశించడం, ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడం వంటి చర్యలు మానుకుని, పాకిస్థాన్ తన సొంత ఆర్థిక సమస్యలు, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో జరుగుతున్న నిరసనల్లో పౌరుల మరణాలపై వస్తున్న నివేదికలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉగ్రవాదంపై ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న తీవ్ర దౌత్యపరమైన వైరుధ్యాలకు ఈ పరిణామాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# బానిస సంకెళ్లను తెంచిన ధీరవనిత 'చాకలి ఐలమ్మ'

## తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వామ్య పెత్తనంపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన విప్లవ తేజం

**బండారి సుమంత్, చీఫ్ ఎడిటర్**
**ఉద్యమపోరు దిన పత్రిక**



**ఉద్యమపోరు, ప్రత్యేక కథనం :**

తెలంగాణ నేల పోరాటాలకు పురిటిగడ్డ. పెత్తందార్ల గడీల అహంకారాన్ని, నిజాం రజాకార్ల అరాచకాలను ఎదిరించి నిలిచిన నేల ఇది. అటువంటి చారిత్రక తెలంగాణ సాయుధ పోరాటానికి ఊపిరిలూది, వెట్టిచాకిరీ వ్యవస్థ పునాదులను కదిలించిన పోరాట యోధురాలు చిట్యాల (చాకలి) ఐలమ్మ. సెప్టెంబర్ 26న ఆమె జయంతి సందర్భంగా ఆ ధీరవనిత సాగించిన వీరోచిత పోరాటాన్ని స్మరించుకోవడం మనందరి బాధ్యత.

**జననం - ప్రారంభ జీవితం**

ఐలమ్మ 1895లో జనగామ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురంలో ఓరుగంటి మల్లమ్మ, సాయన్న దంపతులకు జన్మించారు. ఆమె అసలు పేరు చిట్యాల ఐలమ్మ. చిన్నతనంలోనే పాలకుర్తికి చెందిన చిట్యాల నరసయ్యతో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కులవృత్తితో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారి కుటుంబంపై నాటి భూస్వామ్య వ్యవస్థ కన్నుపడింది.

**గడీల అహంకారంపై గర్జన**

పాలకుర్తి ప్రాంతంలో నాటి దేశ్‌ముఖ్ విస్నూరు రాపాక రామచంద్రారెడ్డి ఆగడాలకు హద్దు లేకుండా ఉండేది. ఆయన తల్లి జానమ్మ గడీ నుంచి సాగే అరాచకాలు పేద ప్రజల రక్తాన్ని పిండేవి. ఐలమ్మ మల్లంపల్లి కొండలరావు వద్ద 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని, ఎంతో శ్రమకోర్చి పంట పండించింది.పేద మహిళ, అదీ బలహీన వర్గానికి చెందిన వ్యక్తి స్వతంత్రంగా ఎదగడాన్ని విస్నూరు దేశ్‌ముఖ్ జీర్ణించుకోలేకపోయాడు. ఆమె పండించిన పంటను బలవంతంగా లాక్కోవాలని తన గుండాలను, రజాకార్లను పంపాడు.

**"నా భూమిలో నేను చెమటోడ్చి పండించిన పంటను తీసుకెళ్లడానికి మీరెవరు?" అంటూ గడీల అహంకారాన్ని నిలదీసిన తొలి ధిక్కార స్వరం ఐలమ్మది.**

**సాయుధ ప్రతిఘటన - ధైర్య సాహసాలు**

ఆమె దౌర్జన్యాలకు బెదరలేదు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల అండతో రోకలిబండలు, బడితెలతో శత్రువులను తరిమికొట్టింది. దేశ్‌ముఖ్ గూండాలను ఎదిరించి, కల్లంలో ఉన్న ధాన్యాన్ని సురక్షితంగా తన ఇంటికి చేర్చుకుంది.ఈ తిరుగుబాటుతో రగిలిపోయిన భూస్వాములు ఆమె ఇంటిని తగులబెట్టారు, కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేశారు. అయినా ఐలమ్మ వెనకడుగు వేయలేదు. గడీల వైపు తుపాకీ ఎక్కుపెట్టి, మహిళా శక్తికి నిలువెత్తు రూపంగా నిలిచింది.

**సాయుధ పోరాటానికి దారితీసిన చిరుమంట**

ఐలమ్మ చేసిన ఈ చిన్న పోరాటం తెలంగాణ వ్యాప్తంగా దావానలంలా వ్యాపించింది. విస్నూరు దేశ్‌ముఖ్ గుండాల చేతిలో దొడ్డి కొమురయ్య అమరత్వంతో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం తీవ్రరూపం దాల్చింది. "దున్నేవాడిదే భూమి" అనే నినాదానికి ఐలమ్మ తిరుగుబాటు ప్రత్యక్ష ప్రేరణగా నిలిచింది.

**నేటి తరానికి ఆదర్శం**

చాకలి ఐలమ్మ కేవలం ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితమైన నాయకురాలు కాదు. ఆమె ఆత్మగౌరవానికి, స్త్రీ సాధికారతకు, పీడిత ప్రజల విముక్తికి ప్రతీక. న్యాయం కోసం నిలబడితే ఎంతటి బలవంతుడినైనా ఓడించవచ్చని చేతల్లో చూపిన ధీరవనిత. 1985 సెప్టెంబర్ 10న ఆమె కన్నుమూసినా, ఆమె నాటిన పోరాట స్ఫూర్తి నేటికీ సజీవంగా ఉంది. చాకలి ఐలమ్మ జయంతి వేళ ఆమె త్యాగాలను, తెగువను స్మరిస్తూ ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు పునరంకితం కావడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి.

---

## వరంగల్ జిల్లా బాలుర జూనియర్ కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తులు అందించిన వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డా. పుల్లూరి శ్రీనివాస్ గౌడ్

**ఉద్యమపోరు, నర్సంపేట, సెప్టెంబర్ 25** : వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా సైనిక్ స్కూల్ అశోక్ నగర్ లో కొనసాగుతున్న జూనియర్ బాలుర కబడ్డీ శిక్షణ శిబిరంలో వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్సార్ యూనివర్సిటీ వరంగల్ డాక్టర్,, పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ విచ్చేసి వరంగల్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తూ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర కబడ్డీ పోటీల్లో పాల్గొనే వరంగల్ జిల్లా బాలుర కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తులు అందించారు... ఈ సందర్భంగా ముఖ్య అతిథి వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వరంగల్ జిల్లా జట్టు విజయం సాధించాలని క్రీడాకారులు క్రమశిక్షణతో తమ నైపుణ్యాలను కనబరిచి తెలంగాణ రాష్ట్రం నుండి జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాలని, క్రీడాకారుల అభివృద్ధికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని, కబడ్డీ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.. వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ మాట్లాడుతూ కబడ్డీ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని వరంగల్ జిల్లాకు పేరు ప్రఖ్యాతలు వచ్చే విధంగా కృషి చేయాలని వరంగల్ జిల్లా కబడ్డీ

అసోసియేషన్ నుండి క్రీడాకారులను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.. ఈ యొక్క కార్యక్రమ ప్రత్యేక అతిథులు సైనిక్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ అనూష, సైనిక్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సాయిల్ గార్లు మాట్లాడుతూ వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సైనిక్ స్కూల్లో కబడ్డీ క్యాంపు నిర్వహించడం ఆనందదాయకమని, క్రీడాకారులు ప్రతిరోజు క్రమశిక్షణతో శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారని రాష్ట్రస్థాయి పోటీలో వరంగల్ జిల్లా జట్టు విజయం సాధించాలని కోరారు..ఈ యొక్క కార్యక్రమంలో వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి ముఖర్జీ ,సహాయ కార్యదర్శి కక్కెర్ల మల్లికార్జున్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవీందర్, నర్సంపేట స్టేడియం ఇన్చార్జి కబడ్డీ కోచ్ యాట రవికుమార్ ముదిరాజ్, సైనిక్ స్కూల్ లెఫ్టినెంట్ కల్నల్ కిరణ్, సైనిక్ స్కూల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం మహేష్,తిరుపతి మరియు కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు..

---

## నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆవుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

**ఉద్యమపోరు, నెక్కొండ, సెప్టెంబర్ 25 :** నెక్కొండ మండలం రెడ్లవాడ సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్ జన్మదినవేడుకలు స్థానిక మహేశ్వర ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా కార్యదర్శి బక్కి అశోక్, మండల అధ్యక్షులు తిరుమల్, చైర్మన్ చల్లా శ్రీపాల్ రెడ్డి లు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ, సొసైటీ డైరెక్టర్ కేవీ సుబ్బారెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, నర్సంపేట కోర్ట్ ఏజీపీ బండి శివ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్, సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోడ ప్రవీణ్, బూరు నరేష్, మైనారిటీ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అన్వర్, చల్లా పాపి రెడ్డి, మాజీ విద్యాకమిటి చైర్మన్ గరికపాటి కృష్ణ రావు, మెట్టు నర్సింహా రెడ్డి, ముప్పా వెంకటేష్ రెడ్డి, బత్తుల సుబ్బారెడ్డి, బానోత్ వీరన్న (చిన్న), వివిధ గ్రామాల సర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్

**ఉద్యమపోరు, ఏన్కూర్, సెప్టెంబర్ 25 :** మండల ప్రత్యేక అధికారి ఎం.డి. ముజాహిద్దీన్ శుక్రవారం ఎంపీపీఎస్, శ్రీరాంపురం తండా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులను పరిశీలించి ఉపాధ్యాయులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- **పౌష్టికాహారంతో ఆరోగ్యకరమైన జీవనానికి బాటలు వేయాలి-ICDS సూపర్వైజర్ రేణుక**

**ఉద్యమపోరు, దిండి (గుండ్లపల్లి), సెప్టెంబర్ 25 :** చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది సూచించారు. 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా శుక్రవారం డిండి మండలంలోని గుండ్లపల్లి, పాత గోనకల్ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా చిరుధాన్యాల ప్రాధాన్యత, పౌష్టికాహారం అవసరం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి పోషక విలువలు కలిగిన పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహార సేవలను గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం పోషకాహారంపై అవగాహన పెంచుకుని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని కోరారు.

# ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు

**ఉద్యమపోరు, మంథని, సెప్టెంబర్ 25 :** పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి వేడుకలను మంథని పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షుడు సబ్బాని సంతోష్ మాట్లాడుతూ.. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితాన్ని, ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాద సిద్ధాంతాలను ప్రస్తావించారు. ఆయన సేవా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బోగోజు శ్రీనివాస్, అసెంబ్లీ సోషల్ మీడియా ఇన్‌చార్జి వొజ్జల మురళీకృష్ణ, సీనియర్ నాయకుడు నారమల్ల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్, నాయకులు చంద్రయ్య, కోరబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి ని కలిసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

- **కేంద్రంతో మాట్లాడి వరంగల్‌కు నిధులు, కీలక సంస్థలు తీసుకురావాలని సీఎంకు విజ్ఞప్తి**
- **కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధుల కోసం కేంద్రాన్ని కోరాలని అభ్యర్థన**
- **వరంగల్ పురావస్తు మ్యూజియానికి కేంద్రం నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించాలని విజ్ఞప్తి**
- **వరంగల్‌లో నైలిట్ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని కోరిన ఎంపీ**
- **సీఐటీడీ కేంద్రం ఏర్పాటుతో యువతకు ఆధునిక సాంకేతిక శిక్షణ అవకాశాలు**
- **వరంగల్‌లో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం కోసం కేంద్రాన్ని కోరాలని సీఎంకు విజ్ఞప్తి**
- **వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్**

**ఉద్యమపోరు, హైదరాబాద్, సెప్టెంబర్ 25 :** వరంగల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గారిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కలిసి వినతిపత్రాలు అందజేశారు. కాకతీయ యూనివర్సిటీకి పీఎం–ఉషా నిధుల మంజూరు, వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర నిధులు, వరంగల్‌లో నైలిట్ (NIELIT), సీఐటీడీ (CITD) కేంద్రాల ఏర్పాటు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (PSK) ఏర్పాటు అంశాలను ముఖ్యమంత్రికి ఎంపీ వివరించారు.

**కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధులు:**
కాకతీయ యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు పీఎం–ఉషా పథకం కింద ప్రతిపాదించిన నిధులను కేంద్రం నుంచి త్వరగా మంజూరు చేసి విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు. విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధన, మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు, పరిశోధకులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు.

**పురావస్తు మ్యూజియానికి రూ.10 కోట్లు:**
వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించేలా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి గారిని ఎంపీ కోరారు. 1991లో ఏర్పాటు చేసిన ప్రస్తుత మ్యూజియం భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త మ్యూజియం భవన నిర్మాణం 2023 మేలో పూర్తయినప్పటికీ కళాఖండాల తరలింపు, పరిరక్షణ, ప్రదర్శన వసతులు, భద్రత, వాతావరణ నియంత్రణ తదితర పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. 2026–31కు సంబంధించిన సవరించిన మ్యూజియం గ్రాంట్ పథకం మార్గదర్శకాలు వెలువడిన అనంతరం ప్రతిపాదన సమర్పించాల్సి ఉన్నందున, ఆ మేరకు కేంద్రంతో సమన్వయం చేయాలని కోరారు.

**వరంగల్‌లో నైలిట్ కేంద్రం:**
వరంగల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (NIELIT) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో మాత్రమే ఉన్న ఈ సంస్థకు వరంగల్‌లో కేంద్రం ఏర్పాటు చేస్తే వరంగల్‌తో పాటు పరిసర జిల్లాల విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఐటీ, ఎలక్ట్రానిక్స్, A I, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ తదితర రంగాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ, ధ్రువపత్రాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**సీఐటీడీ ఏర్పాటుకు విజ్ఞప్తి:**
వరంగల్‌లో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (CITD) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు, నైపుణ్యం కలిగిన యువత, ఎంఎస్ఎంఈలకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. టూల్ అండ్ డై డిజైన్, సీఏడీ/సీఏఎం, సీఎన్‌సీ మిషనింగ్, మౌల్డ్ తయారీ, ప్రెసిషన్ ఇంజినీరింగ్, రోబోటిక్స్, ఆటోమేషన్, 3డీ ప్రింటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందించడంతో పాటు స్థానిక పరిశ్రమలకు సాంకేతిక సహకారం లభిస్తుందని వివరించారు. కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖతో సంప్రదించి ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

**పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలి:**
వరంగల్‌లో ప్రస్తుతం ఉన్న పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (POPSK) స్థానంలో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (PSK) ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. 2017 మార్చి 29న ఏర్పాటు చేసిన POPSK ద్వారా ప్రాంత ప్రజలకు సేవలు అందుతున్నాయని, పాస్‌పోర్ట్ సేవలకు డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. తత్కాల్ పాస్‌పోర్ట్ సేవల కోసం కరీంనగర్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వరంగల్–హనుమకొండ–కాజ◌ీపేట త్రినగర ప్రాంతంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలకు ప్రయోజనం చేకూరేలా తగిన మౌలిక వసతులు, సిబ్బందితో పూర్తిస్థాయి PSK ఏర్పాటు చేయాలని కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడాలని ముఖ్యమంత్రిని ఎంపీ కోరారు.

వరంగల్ ప్రాంత విద్యార్థులు, యువత, పరిశోధకులు, ప్రజలకు మెరుగైన విద్య, నైపుణ్య, సాంకేతిక, కేంద్ర ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించే చర్యలకు కేంద్ర సహకారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున చొరవ చూపాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కోరారు. అలాగే వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారితో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి గారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ప్రస్తావించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయా ప్రతిపాదనలపై సంబంధిత శాఖలతో చర్చించి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య వెల్లడించారు.

# సహకార సంఘ సభ్యుల ప్రయోజనాలకే ప్రాధాన్యత

- **సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**

**ఉద్యమపోరు, మంథని, సెప్టెంబర్ 25 :**
సహకార సంఘ సభ్యులు, రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ సింగిల్ విండోను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో 89వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు, ధాన్యం కొనుగోలు వంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు.గత రబీ సీజన్‌లో 36 కేంద్రాల ద్వారా 5,05,585 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి జిల్లాలో, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచామని పేర్కొన్నారు. గుంజపడుగు శివారులో రూ.3.40 కోట్లతో పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ ప్రాజెక్టు పూర్తి చేశామని, దీనివల్ల సంఘానికి సుమారు రూ.51 లక్షల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ప్రస్తుత ధాన్యం కొనుగోలు సీజన్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య జమ, ఖర్చుల వివరాలను సభకు వివరించారు. సభ్యులు లేవనెత్తిన అంశాలకు చైర్మన్ సమాధానమిచ్చారు. సంఘ మాజీ కార్యదర్శి మామిడాల అశోక్క◌ుమార అకాల మృతికి సమావేశం సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఈ సమావేశంలో సంఘ డైరెక్టర్లు

ఆకుల రాజబాపు, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, సిరిముర్తి ఓదెలు, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి – మొండయ్య, ఉడుత మాధవి – పర్వతాల్ యాదవ్, దేవల్ల విజయ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, సర్పంచులు తోటపల్లి పోచయ్య, సంగెం సరోజన– గట్టయ్య, న్యాతరి లతా–శ్రీనివాస్, గుమ్మడి సమ్మయ్య, సంధ్య–భానేష్, జాడి రామస్వామి, మాజీ ఎంపిపి కొండ శంకర్, సంఘ మాజీ డైరెక్టర్ ఇనుముల సతీష్, నాయకులు బెజ్జంకి డిగంబర్, వేల్పుల గట్టయ్య, తిరుపతి, సబ్బని సంతోష్, పెద్ద సంఖ్యలో సభ్యులు, రైతులు,సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తరలిస్తే.. ఉద్యమమే!

- డిగ్రీ కళాశాల తరలింపు చారిత్రక తప్పిదం...కొండేల మారుతి

**ఉద్యమపోరు, మంథని, సెప్టెంబర్ 25 :** ఎన్నో పోరాటాలు, ఆందోళనల ఫలితంగా సాధించుకున్న మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తరలించడం చారిత్రక తప్పిదమని, ఇది విద్యాభివృద్ధిలో తిరోగమన చర్య అని మంథని విద్యార్థి యువత వ్యవస్థాపకులు కొండేల మారుతి అన్నారు. శుక్రవారం మంథని డివిజన్ డబ్ల్యుజే ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కళాశాల ఆవిర్భావం, అభివృద్ధి ప్రస్థానం, తరలింపు వల్ల కలిగే నష్టాలను వివరించారు.పోరాటాల ఫలితంగా కళాశాల ఆవిర్భావం1979లో అప్పటి విద్యార్థులు, యువత రెండేళ్లపాటు చేసిన పోరాటాల ఫలితంగా మంథనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైందని మారుతి గుర్తుచేశారు. వంద రోజుల నిరాహార దీక్షలు, నిరసన ప్రదర్శనలు, విద్యా తరగతుల బహిష్కరణ వంటి ఉద్యమాల ద్వారా కళాశాల సాధించుకున్నారని తెలిపారు. ప్రజల చిరకాల వాంఛగా ఏర్పాటైన ఈ కళాశాల 1981 నవంబర్ 16న ప్రారంభమైందన్నారు.వసతుల కోసం ఎన్నో అవస్థలుకళాశాల తొలినాళ్లలో జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహించడంతో గదుల కొరత, ఇతర సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ సమయంలోనూ ఇబ్బందులు తలెత్తి వివాదాలకు దారితీశాయని పేర్కొన్నారు. 1983లో వచ్చిన భారీ వరదల నేపథ్యంలో కళాశాల వసతుల దుస్థితిని అప్పటి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వరద బాధితుల పునరావాస కేంద్రం కోసం నిర్మించిన గదులను కళాశాల వినియోగించుకునే అవకాశం కల్పించారని వివరించారు. ఆ భవనాల్లో సుమారు 33 ఏళ్లపాటు కళాశాల కొనసాగిందన్నారు. సొంత భవనంలో కొనసాగుతున్న కళాశాల2012లో మంథని నుంచి మల్లెపల్లి శివారులోని సొంత భూమిలో నిర్మించిన భవనాల్లో కళాశాల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని మారుతి తెలిపారు. నాక్ బృందం కళాశాలకు బి గ్రేడ్ గుర్తింపు ఇచ్చిందని, అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని సిఫార్సు చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. రెండు విడతలుగా గ్రీన్ క్లియరెన్స్‌కు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.పీజీ కళాశాల ఏర్పాటు హామీ ఏమైంది?మంథని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రస్తుత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కళాశాలను సందర్శించిన సందర్భంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే డిగ్రీ కళాశాలతోపాటు పీజీ కళాశాలను కూడా ఏర్పాటు చేస్తామని బహిరంగంగా హామీ ఇచ్చిన విషయాన్ని మారుతి గుర్తుచేశారు. కళాశాలను మరింత అభివృద్ధి చేయాల్సిన సమయంలో తరలింపు నిర్ణయం తీసుకోవడం విద్యాభిమానులను కలవరపెడుతోందన్నారు.కళాశాల జల్సా రాయుళ్లకు అడ్డాగా మారే ప్రమాదం డిగ్రీ కళాశాలను తరలిస్తే ప్రస్తుతం ఉన్న క్యాంపస్‌లో అసాంఘిక కార్యకలాపాలు పెరిగి, జల్సారాయుళ్లకు అడ్డాగా మారే ప్రమాదం ఉందని మారుతి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా ఏర్పడిన విద్యాసంస్థను తరలించడం సమంజసం కాదని పేర్కొన్నారు.సంరక్షణ మండలి ఏర్పాటుకళాశాల తరలింపును అడ్డుకునేందుకు గతంలో చేసిన పోరాటాలకంటే పదింతల తీవ్రతతో ఉద్యమిస్తామని మారుతి హెచ్చరించారు. అవసరమైతే ప్రాణత్యాగానికైనా వెనుకాడకుండా అవిశ్రాంతంగా పోరాడతామని ప్రకటించారు. కళాశాల పరిరక్షణ కోసం విద్యాభిమానులతో కలిసి సత్వరమే డిగ్రీ కళాశాల సంరక్షణ మండలిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాజకీయాలకు తావులేని విధివిధానాలతో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని కళాశాల పరిరక్షణకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలు ఆదర్శనీయం

**- బిజెపి పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్**

**ఉద్యమపోరు, నర్సంపేట, సెప్టెంబర్ 26 :** పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా నర్సంపేట భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ పాల్గొని దీన్ దయాల్ ఉపాధ్యాయ సేవలను, దేశం పట్ల ఆయన అంకితభావాన్ని స్మరించుకున్నారు.పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన 'అంత్యోదయ', సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే ఆలోచన నేటికీ ఎంతో ప్రాసంగికమన్నారు. దేశం, సమాజం కోసం ఆయన చేసిన సేవలు, చూపిన మార్గం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దీన్ దయా ల్ ఉపాధ్యాయ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బీజేపీ కార్యకర్తలు నిరంతరం ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ నాయకులు జూలూరు మనీష్ గౌడ్, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్రబాబు, బిజెపి నాయకులు ముత్యాల శ్రీనివాస్, నర్సయ్య, అజీమ్, అనిల్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్‌కు గుడ్‌బై.. కాంగ్రెస్‌లోకి అనిశెట్టి రామకృష్ణ

**సీతక్క సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న పసర రైస్‌మిల్లు యజమాని**

**ఉద్యమపోరు, గోవిందరావుపేట, సెప్టెంబర్ 25 :** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పసర గ్రామానికి చెందిన రైస్‌మిల్లు యజమాని అనిశెట్టి రామకృష్ణ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా అనిశెట్టి రామకృష్ణకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీతో కలిసి ముందుకు వస్తున్నారని నాయకులు తెలిపారు.ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, గ్రామస్థాయి నుంచి పార్టీకి ప్రజల మద్దతును కూడగడుతున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో అనిశెట్టి రామకృష్ణ కాంగ్రెస్‌లో చేరడం పార్టీకి మరింత బలం చేకూర్చిందని నాయకులు పేర్కొన్నారు.మంత్రి సీతక్క నాయకత్వం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ మార్గదర్శకత్వంలో ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు అన్నారు. కాంగ్రెస్ కుటుంబంలోకి వచ్చిన అనిశెట్టి రామకృష్ణకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేసి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, ములుగు జిల్లా కార్మిక శాఖ అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, కాసర్ల రాంబాబు, గుండెబోయిన అనిల్ యాదవ్, కాడబోయిన రవి, దేపాక కృష్ణ, గొంది కిరణ్, తొడుసు కుమార్ తదితరలు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి

## మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

**ఉద్యమపోరు, సుద్దాల, సెప్టెంబర్ 25 :** యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండల, సుద్దాల గ్రామంలోని గడ్డం సుశీల అనారోగ్యంతో మృతి చెందారు. మానవసేవే మాధవసేవ నినాదంతో ముందుకెళ్తున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ బాబు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. రూ. 5016/- ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల సర్పంచ్ గడ్డమీది మహోదయ్ గౌడ్, ఉప సర్పంచ్ కాసం నాగేష్, వార్డు మెంబెర్ యమగాని జయమ్మ, బత్తిని భరత్, అండం దయాకర్ రెడ్డి, సింగారం శ్రీశైలం, ఎర్ర స్వామి, గడ్డం ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు

## శీరంశెట్టి సత్యమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించిన డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

**ఉద్యమపోరు, నర్సంపేట, సెప్టెంబర్ 25 :** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట పట్టణ కార్యదర్శి శీరంశెట్టి రాజేందర్ పెరక నానమ్మ సత్యమ్మ గురువారం సాయంత్రం మరణించగా బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని శ్రీనివాస్, వడ్డె వెంకన్న, శీరంశెట్టి సురేష్, మద్రి క్రాంతి కుమార్, అక్కల రవీందర్, శీరంశెట్టి సాంబయ్య, అక్కల శివ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్న మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్

**ఉద్యమపోరు, కొత్తపేట, సెప్టెంబర్ 25 :** ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పలు గణేష్ మండపాలను సందర్శించి,ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్న కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్,అనంతరం గణేష్ శోభాయాత్ర, నిమజ్జనోత్సవ కార్యక్రమంలో భాగంగా గణేష్ ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు హాజరై, శోభాయాత్రకు తరలివెళ్తున్న గణనాథులను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు మరియు ప్రజలకు గణేష్ నిమజ్జనోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, విఘ్నాధిపతి శ్రీ గణేశుని ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# రోడ్డంతా గుంతలే.. ప్రయాణం నరకప్రాయం!

- జేఎన్ఎస్ స్టేడియం–బస్టాండ్ మార్గంలో అడుగడుగునా ప్రమాదం
- వర్షం వస్తే గుంతల్లో నీరు.. వాహనదారులు, విద్యార్థుల అవస్థలు

**ఉద్యమపోరు, హన్మకొండ, సెప్టెంబర్ 25 :** హనుమకొండ నగరంలోని జేఎన్ఎస్ స్టేడియం నుంచి బస్టాండ్ వైపు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై భారీగా నీరు ప్రవహించడంతో అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణం వాహనదారులు, స్థానికులకు నరకయాతనగా మారింది. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ కీలక రహదారిపై ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు నిలిచి అవి కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు.విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ప్రయాణికులు ప్రతిరోజూ ఈ మార్గంపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో రహదారి దుస్థితిపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించేలోపే సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్, రహదారుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, గుంతలను పూడ్చడంతో పాటు రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## హనుమకొండలో ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

- అంత్యోదయ భావనతో పేదల అభ్యున్నతికి కృషి చేశారన్న సంతోష్ రెడ్డి

**ఉద్యమపోరు, హనుమకొండ,సెప్టెంబర్ 25 :** హనుమకొండలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పగడాల కాళీప్రసాద్ రావు ముఖ్య అతిథులుగా హాజరై దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత, సార్వభౌమాధికారం కోసం, సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందాలనే అంత్యోదయ భావన కోసం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విశేష కృషి చేశారని అన్నారు. పేదల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలు, చూపిన మార్గదర్శనం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశ నిర్మాణంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చూపిన మార్గంలో కార్యకర్తలు పయనిస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంతోష్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాల విలయం.. నీట మునిగిన ఇందిరమ్మ కాలనీ!

- 49వ డివిజన్‌లో ఇళ్ల చుట్టూ వరద నీరు.. బయటకు రాలేక బాధితుల అవస్థలు
- ఏటా ఇదే తంతు.. శాశ్వత పరిష్కారం కోసం కాలనీవాసుల ఎదురుచూపులు

**ఉద్యమపోరు, హనుమకొండ, సెప్టెంబర్ 25 :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో హనుమకొండ పరిధిలోని 49వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ జలమయమైంది. నివాస ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల చుట్టూ, ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో భారీగా నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు.

**ఏటా ఇదే సమస్య.. పరిష్కారం ఎక్కడ?**

వర్షాకాలం వచ్చిందంటే ఇందిరమ్మ కాలనీ ముంపునకు గురవుతోందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ తాత్కాలికంగా నీటిని తొలగించడం మినహా ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు.

**శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్**

కాలనీలో వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా వెళ్లేలా సబ్-డ్రెయిన్లు, సైడ్ కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైన చోట రహదారులను ఎత్తు పెంచి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రతి వర్షాకాలంలో తాము పడుతున్న అవస్థలకు ముగింపు పలకాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# నూతన పీఏసీఎస్ చైర్మన్లకు ఘన సన్మానం

- పిన్నింటి అనిల్‌రావు, అత్తి కుమారస్వామికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీడీఓమర్యాదపూర్వకంగా కలిసి అభినందించిన అధికారులు

**ఉద్యమపోరు, పర్వతగిరి, సెప్టెంబర్ 25 :** పర్వతగిరి, చౌటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నూతన చైర్మన్లను ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్, సూపరింటెండెంట్ విష్ణుమూర్తి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల నూతనంగా నియమితులైన పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామిని పర్వతగిరి కేంద్రంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# దివ్యాంగులకు సహాయ ఉపకరణాల కోసం గుర్తింపు శిబిరం

- 1 నుంచి 18 ఏళ్లలోపు అర్హులైన వారికి సహాయ ఉపకరణాల అందజేతకు ఏర్పాట్లు
- ఈనెల 26న శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిబిరం

**ఉద్యమపోరు, పర్వతగిరి, సెప్టెంబర్ 25 :** పర్వతగిరి మండలంలోని 1 నుంచి 18 సంవత్సరాల లోపు అర్హులైన దివ్యాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాలు అందించేందుకు గుర్తింపు నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ. భిక్షపతి తెలిపారు. వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 26న శనివారం ఉదయం 9 గంటలకు శిబిరం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు శిబిరానికి హాజరయ్యే సమయంలో సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు ఒక ఫొటో వెంట తీసుకురావాలని సూచించారు. శిబిరానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం ఐఆర్‌పీ అశోక్‌ను 9949303163 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

## ఏటూరునాగారంలోనే న్యాయస్థానం ఏర్పాటు చేయాలి

**- సర్పంచ్ శ్రీలత విజ్ఞప్తి**

**ఉద్యమపోరు, ఏటూరునాగారం, సెప్టెంబర్ 25 :** తెలంగాణ రాష్ట్రంలో న్యాయవ్యవస్థను మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం 200 కొత్త అదనపు జూనియర్ సివిల్ జడ్జి–కమ్–అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టుల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలోనే న్యాయస్థానం ఏర్పాటు చేయాలని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కోరారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను కలిసి ఏటూరునాగారానికి న్యాయస్థానం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏటూరునాగారం వంటి మారుమూల, గిరిజన ప్రాంతాలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏటూరునాగారం కేవలం మండల కేంద్రం మాత్రమే కాకుండా విస్తృతమైన గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు పరిపాలనా కేంద్రంగా ఉందని శ్రీలత తెలిపారు. స్థానిక ప్రజలు తమ న్యాయపరమైన వ్యవహారాల కోసం ఇతర ప్రాంతాల్లోని కోర్టులను ఆశ్రయించాల్సి వస్తే ప్రయాణ ఖర్చులు, సమయం, రవాణా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

**న్యాయం ప్రజల వద్దకే రావాలి**

"న్యాయం ప్రజల వద్దకు రావాలి" అనే సూత్రంతో ఏటూరునాగారం మండల కేంద్రంలోనే న్యాయస్థానం ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. స్థానికంగా కోర్టు అందుబాటులోకి వస్తే ప్రజలకు న్యాయ సలహాలు పొందడం, కేసుల దాఖలు, విచారణలకు హాజరు వంటి అంశాల్లో ప్రయాణ భారం తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే స్థానిక న్యాయవాదులు, న్యాయ సేవా సంస్థలు, సంబంధిత పరిపాలనా విభాగాల మధ్య సమన్వయం మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 200 కొత్త కోర్టుల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఈ అవకాశాన్ని ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కోరారు.

# వర్ధన్నపేటలో వైన్స్‌లపై దొంగల పంజా!

- ఒకే రాత్రి రెండు వైన్స్‌లలో భారీ చోరీ
- రూ.3.05 లక్షల నగదు మాయం.. తాళాలు, వెంటిలేటర్లు పగులగొట్టి చొరబాటు
- రంగంలోకి దిగిన పోలీసులు.. దొంగల కోసం ముమ్మర దర్యాప్తు

**ఉద్యమపోరు, పర్వతగిరి, సెప్టెంబర్ 25 :** వర్ధన్నపేట పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. పట్టణంలోని మల్లికార్జున వైన్స్, రేణుక ఎల్లమ్మ వైన్స్‌ను టార్గెట్ చేసిన గుర్తుతెలియని దొంగలు ఒకే రాత్రి రెండు షాపుల్లో చొరబడి భారీగా నగదు దోచుకెళ్లిన ఘటన కలకలం రేపింది. వైన్స్ నిర్వాహకులు ప్రతిరోజూ మాదిరిగానే సెప్టెంబర్ 24 రాత్రి సుమారు 9:30 గంటలకు షాపులను మూసివేసి వెళ్లారు. అనంతరం సెప్టెంబర్ 25 ఉదయం సుమారు 10 గంటలకు షాపులు తెరవగా దొంగతనం జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. మల్లికార్జున వైన్స్‌లో వెనుక తలుపు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు కౌంటర్‌లోని రూ.2.40 లక్షల నగదును అపహరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా రేణుక ఎల్లమ్మ వైన్స్ వెనుక ఉన్న వెంటిలేటర్‌ను పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగలు కౌంటర్‌లోని రూ.65 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు వైన్స్‌లలో కలిపి రూ.3.05 లక్షల నగదు చోరీ కావడంతో స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాళాలు, వెంటిలేటర్లు పగులగొట్టి దొంగలు పక్కా ప్రణాళికతోనే చోరీకి పాల్పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైన్స్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాలను పరిశీలిస్తూ దొంగల ఆనవాళ్లు, సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. గుర్తుతెలియని దుండగులను పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
శనివారం 26.09.2026

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- రూ.8,500 జరిమానా.. బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం
- ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు సంచలన తీర్పు

**ఉద్యమపోరు, ములుగు జిల్లా , సెప్టెంబర్ 25 :** మంగపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు మాతూరి రమేష్‌ను దోషిగా నిరారిస్తూ ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. నిందితుడికి రూ.8,500 జరిమానాతో పాటు బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మంగపేట పోలీస్‌స్టేషన్‌లో 2020లో క్రైమ్ నంబర్ 146/2020 కింద భారతీయ శిక్షాస్మృతిలోని 376(ఎన్), 366, 506 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని 5 ఆర్/డబ్ల్యూ 6 సెక్షన్ల కింద కేసు నమోదైంది. కేసును విచారించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు–కమ్ ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.వి.పీ. సూర్యచంద్రకళ తీర్పు వెలువరించారు. ఈ కేసులో అప్పటి ఏటూరునాగారం అదనపు ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్, గౌస్ ఆలం, ఐపీఎస్ దర్యాప్తు అధికారులుగా వ్యవహరించగా, ఎస్సై శ్రీనివాస్ ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. కేసు దర్యాప్తు, కోర్టు సమన్వయం, ప్రాసిక్యూషన్‌లో ప్రస్తుత అధికారులు అదనపు ఎస్పీ మానన్ భట్, ఐపీఎస్, సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై టీవీఆర్ సూరి, కోర్టు పర్యవేక్షణ అధికారి డీఎస్పీ కిషోర్, కోర్టు అనుసంధాన అధికారి ఏఎస్సై కుమారస్వామి, ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది డి. రామ్‌సింగ్, సీడీఓలు కే. మౌనిక (డబ్ల్యూఎస్‌టీ–187), జె. మంగీలాల్ (పీసీ–164) తదితరులు కీలకంగా పనిచేశారు. కేసు దర్యాప్తు, కోర్టు సమన్వయం, ప్రాసిక్యూషన్‌లో సమిష్టిగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్, ఐపీఎస్ అభినందించారు. పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టడంతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# 14 మంది విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- గురుకుల పాఠశాలకు చేరుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- లోనికి అనుమతించకపోవడంతో హాస్టల్ ఎదుట ధర్నా.. వసతులపై ఆగ్రహం

**ఉద్యమపోరు, జనగామ జిల్లా/పాలకుర్తి, సెప్టెంబర్ 25 :** జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై స్పందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విద్యార్థినులను పరామర్శించేందుకు శుక్రవారం పాఠశాల, హాస్టల్ వద్దకు చేరుకున్నారు. ఘటనకు గల కారణాలను విద్యార్థినులను అడిగి తెలుసుకునేందుకు పాఠశాలలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఎర్రబెల్లిని పోలీసులు, పాఠశాల సిబ్బంది అడ్డుకున్నారని ఆయన వర్గాలు తెలిపాయి. విద్యార్థుల పరిసితి గురించి తెలుసుకున్న తర్వాతే వెళ్తానని ఎర్రబెల్లి చెప్పినప్పటికీ అనుమతి ఇవ్వకపోవడంతో హాస్టల్ ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్‌తో ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడారు. విద్యార్థినులకు అవసరమైన కనీస వసతులు కల్పించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ పరిసరాల్లో అపరిశుభ్రత, పేరుకుపోయిన వ్యర్థాలు ఉన్నాయని, గతంలో అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని పాము కరిచిన ఘటన కూడా జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ మంగళవారం 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచినప్పటికీ ఘటనపై వార్డెన్, ఉపాధ్యాయులు, అధికారులు సకాలంలో స్పందించకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థినుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ పాఠశాలల కార్యదర్శి శారదతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలను తెలియజేసినట్లు ఎర్రబెల్లి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారని చెప్పారు. హాస్టల్‌లో విద్యార్థినులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎర్రబెల్లి ఆరోపించారు. పాఠశాలల్లో విద్యార్థినుల భద్రత, వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో విద్యార్థుల సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. కాగా, విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటనపై సంబంధిత అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- పల్లెలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలిప్రకృతిని కాపాడటం
  ప్రతి ఒక్కరి బాధ్యత: మంత్రి సీతక్క

**ఉద్యమపోరు, ములుగు జిల్లా / మల్లంపల్లి, సెప్టెంబర్ 25 :** పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ‘స్వచ్ఛత హి సేవ’ కార్యక్రమంలో మంత్రి సీతక్క, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి , ఐఎఫ్ఎస్‌తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కల పెంపకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.‘స్వచ్ఛత హి సేవ’ పక్షోత్సవాల్లో భాగంగా చేపట్టిన ‘ఏక్ పేడ్ మా కే నామ్’ కార్యక్రమంలో మంత్రి సీతక్క మొక్కను నాటారు. పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.గ్రామాల పరిశుభ్రత కోసం నిత్యం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులను మంత్రి సన్మానించారు. వారికి సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు, చేతి తొడుగులతో కూడిన రక్షణ కిట్లను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అడవులు, పచ్చదనం కారణంగానే ములుగు జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. ప్రకృతే మానవాళికి, జీవరాశులకు జీవనాధారమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయాలని పిలుపునిచ్చారు. “పరిశుభ్రతను పాటిద్దాం..పచ్చదనాన్ని పెంచుదాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం” అనే నినాదంతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. మహిళా సంఘాల సభ్యులతో పాటు ప్రజలంతా శ్రమదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. శారీరక శ్రమతో ఆరోగ్యంగా, దృఢంగా ఉండవచ్చని తెలిపారు. ఎండ, వాన, చలిని తట్టుకుంటూ కష్టపడే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని, ప్రకృతితో మమేకమై జీవించాలని మంత్రి సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మంచి విద్యార్థులుగా ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సురేష్‌బాబు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావు, డీపీఓ వెంకయ్య, డీఆర్‌డీఓ రవీందర్, ఎంపీఓ రహీం, ఏపీడీ, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా సమన్వయకర్త, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లిలో రెండు లారీలు ఢీ.. తప్పిన పెను ప్రమాదం

- ప్రధాన రహదారిపై లారీల ఢీకొనడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం
- అక్రమ పార్కింగ్‌తో ప్రమాదాలకు అవకాశం.. చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

**ఉద్యమపోరు, ములుగు జిల్లా/మల్లంపల్లి, సెప్టెంబర్ 25 :** ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీలు ఢీకొనడంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ప్రధాన రహదారికి ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలను నిలిపివేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై నిలిపి ఉంచిన లారీలు ఇతర వాహనదారులకు సరిగా కనిపించక ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మల్లంపల్లి ప్రధాన రహదారిపై లారీల పార్కింగ్ సమస్య ఇప్పటికే పలుమార్లు తలెత్తుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ వాహనాలను ప్రధాన రహదారిపై నిలిపివేయకుండా నిర్ణీత ప్రదేశాల్లోనే పార్కింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి లేకుండా రహదారిపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రామప్ప వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

- కాకతీయుల శిల్పకళకు రామప్ప దేవాలయం నిలువెత్తు నిదర్శనం
- చారిత్రక, ప్రకృతి సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలి: మంత్రి సీతక్క

**ఉద్యమపోరు, ములుగు జిల్లా , సెప్టెంబర్ 25 :** కాకతీయుల శిల్పకళా వైభవం, పచ్చని అడవులు, సెలయేళ్లు, జలపాతాలు, గుట్టలు, వాగులతో ములుగు జిల్లా ప్రకృతి వర్ణశోభకు నిలయంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. జిల్లాలోని చారిత్రక కట్టడాలు, ప్రకృతి సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.వెంకటాపూర్ మండలం పాలంపేటలో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఆవరణలో ప్రపంచ పర్యాటక దినోత్సవం–2026ను పురస్కరించుకొని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన హెరిటేజ్ వాక్, తెలంగాణ దర్శిని, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు.గొల్లల గుడి నుంచి రామప్ప దేవాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం రామప్ప దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని “డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం” అనే అంశంతో నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ 13వ శతాబ్దంలో నిర్మితమైన రామప్ప దేవాలయం కాకతీయుల కళా సంపదకు నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శతాబ్దాలుగా తరతరాలకు అందుతున్న ఈ అపురూప వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా ములుగుకు ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి పేర్కొన్నారు. పచ్చని అడవులు, గుట్టలు, సెలయేళ్లు, వాగులు, వన్యప్రాణులతో జిల్లాలో అపారమైన ప్రకృతి సంపద ఉందన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరతో పాటు లక్నవరం సరస్సు, బొగత జలపాతం, మల్లూరు లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వంటి పర్యాటక ప్రాంతాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని తెలిపారు.చారిత్రక కట్టడాలు, ప్రకృతి సంపదను పూర్వీకులు అందించిన వారసత్వంగా మాత్రమే కాకుండా భావితరాలకు అందించాల్సిన విలువైన ఆస్తిగా భావించాలని మంత్రి సూచించారు. పర్యావరణం, చరిత్ర పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. పర్యాటక రంగంలో ములుగు జిల్లాకు పురస్కారం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు.కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, సమాచార పౌర సంబంధాల శాఖ సంస్కృతిక కళాసారథి కళాకారుల బృందం ప్రదర్శించిన గేయాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంత్రి సీతక్క బహుమతులు అందజేశారు.చల్వాయి టీజీఎంఎస్‌కు చెందిన డి. శ్రీజ బృందం ప్రథమ బహుమతి, దేవగిరిపట్నం తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలకు చెందిన ఆర్. శ్రీవల్లి ద్వితీయ బహుమతి, గోవిందరావుపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. మనస్విని, ఎ. శ్రుతి, ఎం. పావలి తృతీయ బహుమతి అందుకున్నారు. మరో విభాగంలో గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.డి. యాస్మిన్ విజేతగా, మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె. దిలీప్ రన్నరప్‌గా నిలిచారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన రంజిత్, రుత్విక్ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్‌జీ, సంపత్‌రావు, పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ భగవాన్‌రెడ్డి, పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్, స్థానిక సర్పంచ్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో..?

**ఉద్యమపోరు, ఏన్కూర్, సెప్టెంబర్ 25 :** ఏన్కూర్ మండల పరిధిలోని ఆరికాయలపాడు- జన్నారం గ్రామాల మధ్య వాగు పొంగిపొర్లడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలు కురిసిన ప్రతిసారీ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎ దుర్కొంటున్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు కూడా అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణానికి గతంలోనే అనుమతి లభించిందని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నప్పటి కీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం పై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతులకు సౌరశక్తి భరోసా..
# డీఈ రమేష్ క్షేత్రస్థాయి పరిశీలన

**ఉద్యమపోరు, ఏన్కూరు, సెప్టెంబర్ 25 :** ఏన్కూరు మండల పరిధిలోని శ్రీరామగిరి ,లచ్చగూడెం గ్రామంలో వ్యవసాయ అవసరాలకు సౌర విద్యుత్ వ్యవస్థను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసే అంశంపై విద్యుత్ శాఖ డీఈ రమేష్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ మోటార్ల వద్దకు వెళ్లి ప్రస్తుత విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించడంతో పాటు, సౌర విద్యుత్ ద్వారా మోటార్లను నిర్వహించే అవకాశాలను పరిశీలించారు.రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తగ్గించే దిశగా సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు చర్చించారు. ప్రయోగాత్మకంగా సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలు, మోటార్ల వద్ద ఉన్న పరిస్థితులు, అవసరమైన సాంకేతిక ఏర్పాట్లను డీ.ఈ రమేష్ పరిశీలించారు. క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడి యాసిన్, ఏఈ ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దవాగు వరద పరిస్థితిని పరిశీలించిన
## పినపాక తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి

**ఉద్యమపోరు, పినపాక, సెప్టెంబర్ 25 :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని ఈ బయ్యారం సమీపంలో ఉన్న పెద్దవాగు వరద ఉధృతిని పినపాక తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ తో కలిసి ఆయన వాగులోకి వస్తున్న నీటి ప్రవాహాన్ని, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలను పరిశీలించి, అధికారుల నుంచి వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... వర్షాల కారణంగా స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అత్యవసర సమయాల్లో సహాయం అందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. వర్షాలు, వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు వాగు పరివాహక ప్రాంతాల నివాసితులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న సమయంలో వాటిని దాటేందుకు సాహసించకూడదు.పిల్లలు, పశువుల కాపరులు వాగుల వైపు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్థానిక రెవెన్యూ అధికారులకు లేదా మండల పరిషత్ కార్యాలయానికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొండారెడ్డిపల్లిలో భక్తిశ్రద్ధలతో గణపతి నిమజ్జనం

**ఉద్యమపోరు, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ** కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణనాథుడిని భక్తులు, యువత ఉత్సాహంగా ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులు గణపతి నామస్మరణలు, జైజైకారాలతో సందడి చేశారు. కార్యక్రమంలో కంటెస్టెడ్ సర్పంచ్ ప్రేమ్ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ నరేష్, వార్డు సభ్యుడు మాధవ్, నాయకులు ఉదయ్ గౌడ్, సత్యం గౌడ్, శివ గౌడ్, సాయి గౌడ్, అరవింద్ గౌడ్, రితీష్, తక్రుబ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**రూ.52 వేలతో మహాగణపతి లడ్డూ సొంతం**

కొండారెడ్డిపల్లి గ్రామంలోని గౌడ్స్ కాలనీలో ఏర్పాటు చేసిన మహాగణపతి లడ్డూ వేలంపాటలో ఎస్ఎస్ డైరీ ఫార్మ్స్ అధినేతలు కానం శివగౌడ్, బుర్రి సాయిగౌడ్ రూ.52 వేలతో లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వినాయక సేవా సమితి సభ్యులు వారికి అభినందనలు తెలిపారు. మహాగణపతి ఆశీస్సులు శివగౌడ్, సాయిగౌడ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

**కాకునూరులో ఘనంగా అన్నదానం..**
**విఘ్నేశ్వరుడి సన్నిధిలో సేవా స్ఫూర్తి**

కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కీర్తిశేషులు అల్లం రామకోటి రెడ్డి, అల్లం వెంగల్ రెడ్డి జ్ఞాపకార్థంగా సాయినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం చేయడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని చాటినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా విఘ్నేశ్వర యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కీర్తిశేషుల జ్ఞాపకార్థంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. భక్తి, సేవ, ఐక్యతతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో విఘ్నేశ్వర యూత్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**వినాయకుడి లడ్డూకు భారీ ధర..**
**రూ.2.30 లక్షలకు సొంతం**

కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలంపాట శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వేలంపాటను ఆసక్తిగా తిలకించారు. పెద్ద లడ్డూకు పోటీగా వేలం కొనసాగగా, చివరకు గంగపురం మహాలింగం రూ.2,30,000లకు దక్కించుకున్నారు. చిన్న లడ్డూను పోరండ్ల శ్రీనివాసులు రూ.5,500లకు సొంతం చేసుకున్నారు. లడ్డూలను దక్కించుకున్న భక్తులు వినాయకుడి ఆశీస్సులతో కుటుంబ సభ్యులకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,, ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ వేలంపాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. వేలంపాట ద్వారా వచ్చిన మొత్తాన్ని ఉత్సవాల నిర్వహణతో పాటు సామాజిక కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. లడ్డూ వేలంపాట విజయవంతం కావడంతో నిర్వాహకులు, కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. లడ్డూలను దక్కించుకున్న గంగపురం మహాలింగం, పోరండ్ల శ్రీనివాసులను నిర్వాహకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# షామీర్‌పేట పెద్ద చెరువుకు సీట్‌బెల్ట్‌తో వినాయకుడు

- అంగరంగ వైభవంగా గణేశ్ నిమజ్జనోత్సవాలు

**ఉద్యమపోరు, శామీర్ పేట, సెప్టెంబర్ 25 :** గణేశ్ నిమజ్జనోత్సవాలు శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద శుక్రవారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. షామీర్‌పేట పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో గణనాథులను భక్తులు నిమజ్జనానికి తరలించారు. భక్తుల నినాదాలతో చెరువు పరిసర ప్రాంతాలు మార్మోగాయి.ప్రత్యేకంగా ఓ వినాయక విగ్రహాన్ని వాహనంలో సీట్‌బెల్ట్ కట్టి తరలించడం అందరినీ ఆకట్టుకుంది. వినాయకుడికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా భక్తులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.నిమజ్జనోత్సవాల సందర్భంగా షామీర్‌పేట పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కీసర సర్కిల్ పోలీసు అధికారులు సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతోపాటు రాత్రివేళల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.భక్తుల సౌకర్యార్థం 24 గంటలూ తాగునీటి సరఫరా, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచారు. వాలంటీర్లను ఏర్పాటు చేసి చెరువు పరిసరాల్లో భక్తులకు అవసరమైన సహాయాన్ని అందించారు. నిమజ్జనోత్సవాలను తిలకించేందుకు చిన్నారులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అధికారులు, పోలీసులు సమన్వయంతో చేపట్టిన ఏర్పాట్లతో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది.

# భూపాలపట్నం రహదారిపై వర్షపు నీరు..
# తక్షణ చర్యలు చేపట్టిన ఎంపీడీవో, సర్పంచ్

**ఉద్యమపోరు, పినపాక, సెప్టెంబర్ 25 :** పినపాక మండలం భూపాలపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో భారీ వర్షాల కారణంగా రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్న విషయం గుర్తించిన సర్పంచ్ స్వప్న వెంటనే స్పందించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి నీరు నిలిచిన ప్రాంతంలో అవసరమైన చర్యలు చేపట్టారు. చేపట్టిన పనులను ఎంపీడీవో సంకీర్త్, ఎంపీవో వెంకటేశ్వరరావు పరిశీలించి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. దీంతో స్థానికులు సర్పంచ్, అధికారుల స్పందనపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ అరుణ శ్రీ, గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com